అడుక్కునే వాడిపై అన్యాయంగా నిందమోపినా మౌనంగా భరిస్తాడెందుకని?

వేదుల శకుంతల కధ

# కాల్మొక్త నీ బాంచన్

ఆరోజు మధ్యాహ్నం నుంచి మబ్బులు పడుతూ ఆకాశం గడబిడ చేస్తోంది. ఆ రాత్రిలోగ ఎప్పుడైనాసరే దడదడా వర్షం కురిపిస్తానన్నట్టుగ బెదిరిస్తోంది! ముందే వార్నింగ్ ఇచ్చి దోపిడీ చేసే ఘరానా దొంగలా!

సెంద్రిగాడి చెయ్యి పట్టుకుని గబగబా నడుస్తున్నాడు యాదులు. ఎండు కర్రల్లా సన్నగా పొడుగ్గా ఉన్న ఆ కాళ్ల జోరుకో అంగపడ్తుంటే సెంద్రిగాడు ఆ కాళ్ళతో పోటీ పడలేక — పరిగెట్టే ఓపిక లేక — తన చేయి పట్టుకున్న పెద్ద చేయిని ఆసరా చేసుకుని పడుతూ లేస్తూ రోడ్డుమీద నడుస్తున్నాడు.

పదేళ్ళు కూడా లేవు సెంద్రిగాడికి. ఆ వయస్సువాళ్ళ కుండవలసిన మెరుపులు, పసిడికాంతులు వాడి బుగ్గల్లో... కళ్ళల్లో లేవు. ఎండిపోయిన నీటి చెలమల్లా... ఆ కళ్ళల్లో తళుకులుండవు. ఆ బుగ్గల్లో నవనవ ఉండదు. తోటకూరకాడల్లా మెత్తగా వాడిలిపోయినట్టున్న ఆ శరీరం మీద వదులుగా గూడలు దిగి మోచేతుల దాకా పాకిన ఓ చొక్కా ఉంది. గోచీకన్నా మరి కాస్త పెద్దదైన డ్రాయరు (లాగు) ఉంది. ఆకారానికి ఓ రక్షణ ఉందన్నందుకు సాక్ష్యాలే ఆ గుడ్డలు తప్ప — అందచందాలు చూపాలన్న తాపత్రయం ఏమూలా లేదు. చీమిడి కారినప్పుడు తుడుచుకున్న ముక్కు మరకలు ... ఏపండో తిన్నాక చేయి తుడుచుకున్నప్పటి అట్టలు (ఎండిన వారికలు)... దుమ్ము ధూళి ఆ చొక్కా నిండా చేరి అంతకుముందు దానికున్న రంగుని, డిజైన్‌ని మార్చేశాయి! ఎవరో



పెద్దవాళ్ళ పొట్టి చేతుల చొక్కా. అయినా పదేళ్ళ సెంద్రిగాడికి అభ్యంతరంగా లేదు.

'ఉండే అయ్యా! జర్రాగు'' రోడ్డు ప్రక్క షాపులో కలర్ టి.వి.లో చూస్తున్న బొమ్మలు చూస్తూ తండ్రి చేయి ఎడిపించుకోబోయేడు సెంద్రిగాడు.

''మయూర్, మయూర్ ఫ్యాబ్రిక్స్'' అంటూ వస్తోంది పాట షూటింగ్, షర్టింగ్

రకరకాలు చూపిస్తున్నారు.... అద్వర్ టైజ్ మెంట్స్ తిరిగిపోతున్నాయి! యాదులు కొడుకు చేయిగుంజి "ఇగపా నదు! గయిజూస్తే ఏమొస్తదిరా? యాడ సన్నగింత తినటందుకు దొరికితే — జల్ది ఇంటికి పోదాం! (గుడిసెకి) పొద్దుగాలనుంచి తిరగతనే ఉంటిమి. గాలి దుమారం అస్తే — గుడిసె ముంగటు అంత నిండిపోతది — గోనె పట్ట ఎగిరిపోతది. కుక్క దూరి దొంతులన్ని దొర్లిస్తది. జల్ది పోదాం పా!" అన్నాడు. మహా సామ్రాజ్యాన్ని శత్రువులు ముట్టడించే సమయంలో రాజుగారు చూపే ఆందోళనలా ఉంది యాదులుగాడి ఆరాటం!

సెంద్రిగాడికి తండ్రి మాటలు వినబడటం లేదు. సినిమా హాళ్ళముందు చేయిచాచి యాచించుకోవడమే తెల్సుగానీ లోపల వాళ్లు చేసే విచిత్రాలు ఎన్నడైనా తను చూసేడా? ఈ టీవీలు వచ్చాక, అవి దుకాణాల్లో పెట్టుకున్నాక — కొత్త ప్రపంచంలా ఇన్నేసి వింతలు చూడగల్గుతున్నాడు. అంత చిన్న పెట్టెలో అంతమంది ఫొటోలు ఎలా దాచిపెట్టారా అని సెంద్రిగాడికి మహాచెడ్డ ఆశ్చర్యం వేసింది మొదటిసారి టీవి చూసినప్పుడు.

"అయ్యా గన్ని ఫొటోలు ఎట్లుంటయే అందులో? ఎవ్వరు మూత తెరిసి సూపకుండ, గవాంతట గయే తిరుగుతుంటవా?" అని తండ్రిని అడిగేడు.

"ఎర్రిసన్నాసి! అందులో మీటలుంటయిరా! మీట ఎంబటి మీట కదుల్తా ఉంటే — బొమ్మ ఎంబడి బొమ్మ కండ్లబడ్తది" అని చెప్పేడు యాదులు. సెంద్రిగాడు కళ్ళింత పెద్దగా షెట్టి తన తండ్రికి ఎట్లా తెలుసా? అన్నట్లు చూసేడు. కొడుకుని దగ్గరకి లాక్కుని కొబ్బరి పీచులాంటి జుట్టు గోళ్ళతో నిమిరి — మో కాళ్ళ మీదున్న మట్టి దులిపి — "సదూకున్న మారాజులు గస్వంటివన్ని తయారు చేస్తరు కొడకా!" అన్నాడు.

"మరి గట్లయితే నేను సదుకుంట! నాకు కూడా గస్వంటి ఇసిత్రాలు చేసే తెలివి వస్తది" అన్నాడు సెంద్రిగాడు.

యాదులు నవ్వి కొడుకుని ఒళ్ళోకి లాక్కుని "సెంద్రీ సదువు మనలాటోళ్ళకి కాదురా. మారాజులకిరా! వాళ్ళకి దబ్బుంటది. మనకేడదిరా? నేనేమన్నా కొలువజేస్తున్ననా? పెద్దపెద్ద కితాబులు (బుక్స్) పట్టుకొని బిల్డింగ్ లల్ల సదివేటందుకు మన తాన పైసలున్నాయిరా? పిచ్చి మాలోకమా? గిస్వంటి తప్పుడు కూతలు కుయ్యగూడదు బిడ్డ! చిన్న నోటికి పెద్దమాటలు రాగూడదు. మీ యమ్మే బతికుంటే గిస్వంటివన్ని చెప్పేది" అంటూ ఎనాడో ఎప్పుడో చనిపోయిన మల్లవ్వని తల్చుకుని తలగుడ్డతో కళ్లతడి తుడుచుకున్నాడు యాదులు.

సెంద్రిగాడికి తల్లి గుర్తులేదు. వాడికి బుద్ధి ఎరిగినప్పట్నుంచి తండ్రే తెలుసు!

అడుగులేసే నాటినుంచి అయ్యతో కలిసి 'అమ్మా' అని పిలుస్తూ అడుక్కోటం... సత్తుగిన్నెలో నిండిన దాన్ని ఏ చెట్టుకిందో అయ్యతో కలిసి తినడం — ఓపిక ఉంటే రేపటి కోసం మళ్ళీ యాచించి దాచుకోడం

ఇదే తెలుసు! అందుకని అయ్య కళ్ళు తుడుసుకుంటే — 'నేను సదూకోనులే అయ్యా' అన్నాడు.

అప్పట్నుంచి యాదులు, సెంద్రిగాడికి ఎలా బతకాలో ఎలాంటిచోట్ల అడుక్కోవాలో, ఎవరెవర్ని అడగాలో అవన్నీ తన కూడా తిప్పి తర్ఫీదు ఇచ్చేవాడు. ముప్ఫయి ఐదేళ్ళ యాదులుకి ... ఆకలి తీరినప్పుడల్లా సెంద్రిగాడి బతుకు మీదే ఆలోచనలు!

వాడు పెద్దవాడవుతున్నాడనీ — ఆకలి పెరుగుతుందనీ — రోజూ తప్పకుండా ఎక్కడో వాడికి కడుపు నిండా తిండి దొరకాలనీ చలికాలం వణికిపోకుండా — పాత కంబళి లాంటిది సంపాదించాలనీ ఏ పాతకోటో ముష్టెత్తారి వానాకాలం నెత్తిమీద కప్పుకుందుకు — ప్లాస్టిక్ సంచులు పోగుచెయ్యాలని — తెగ యోచిస్తుంటాడు.

టీవిలో బాంబినో వారి రుచులన్నీ నోరూరించేలా చూపిస్తున్నారు.

యాదులకి పేగుల్లో మంచి ఆకలి అరుపు వినిపించింది. సెంద్రిగాడి చెయ్యి గుంజి "నడు నడు" అన్నాడు.

ఇంతలో పక్కనున్న సూటు కుర్రాడు పురుగు మీద పడినట్టు ఉలిక్కిపడి "ఏరా నెధవ! మీద చెయ్యి వేస్తావా? ముష్టి వెధవ్వి దూరంగా నిలబడాలని తెలియదూ?" అని ఎగిరిపడ్డాడు సెంద్రిమీద.

"చెయ్యి ఎక్కడేసిన దొరా? గీ పక్కనే నిలబడ్డ గదా?" తన చెయ్యి ఒకటే తండ్రి చేతిలో ఉంది. రెండోది ఇటు పక్కవుంది.

మరి అటు పక్క నిలుచున్న మనిషి మీద ఎలా పడుతుందా? అనుకున్నాడు సెంద్రి. "ఏడ్చేవ్ వెధవ! ఇంకా మాట్లాడుతున్నావా? మా పక్క నిలబడటానికి నీ కెన్నిదమ్ములా? నీ ముఖానికి టీవి చూడాలా;? దొంగ రాస్కెల్" గుంపు చెదిరి అందరూ వెనక్కి చూశారు.

అప్పటికే యాదులు సెంద్రిగాడి చెయ్యి పట్టుకుని బరబరా రోడ్డుమీదకి ఈడ్చుకెళ్లేడు. లేకపోతే... ఏం జరిగేదో?—— ఇంతకీ ఆ సూటువాలా మీద సెంద్రిగాడి చెయ్యి కాదు గదా వేలుగూడా తగల్లేదు! ఆఫ్ట్రాల్ అడుక్కునే వెధవ తన పక్కన నిల్చోటమా? డామ్ ఇన్సల్ట్!!!

## బట్టతల



ప్రముఖ సినీనటుడు సదాశివంకి వెర్రి అభిమానులున్నారు. అతని వుంగరాల జుట్టులోని ఒక వెంట్రుకయినా పంపించండని ఉత్తరాలు రాసేవారు. వాళ్లందరికీ వెంట్రుకలు పంపించేవాడు సదాశివం అది చూసి.

"ఇలా అయితే కొన్నాళ్లకి మీకు బట్టతల అయిపోతుంది" అన్నాడో నిర్మాత.

"బట్టతల నాకెందుకవుతుందండీ. అయితే నా కుక్కకి కావాలి గానీ" నవ్వుతూ అన్నాడు సదాశివం.

కొడిమెల శ్రీరామమూర్తి (ఏలూరు)

మబ్బులు మరింత దట్టంగా కమ్ముకు వస్తున్నాయి. యాదులు అడుగులు వడివడిగా పడ్తుంటే... సెంద్రిగాడు పరుగులు పెట్టాల్సి వస్తోంది.

సిన్మాహాలు దగ్గర రద్దీబాగా ఉంది. గేటు దగ్గర మిర్చీ బండీ... మసాలా వడ... ఘుమఘుమలాడి పోతుంటే... చెనా బఠానా, గరమ్ గరమ్ . • ఫల్లి ముక్కాకళ్ళలో వేగిపోతున్నాయి. రిక్షాలు... ఆటోలు... స్కూటర్లు · కార్లు... ఆగుతూంటే... మంత్రగాడు మంత్రదండం ఊపుతే పుట్టు కొచ్చిన వస్తువుల్లాగ – కొత్త కొత్త ఫ్యాషన్లు... దిగుమతి అవుతున్నాయి.

యాదులు అక్కడ ఆగకుండా ముందుకు నడుస్తుంటే – "అయ్యా ఈడ ఆగుదాం!" అన్నాడు సెంద్రిగాడు.

ఓసారి ఆగేటు వేపు చూసి "వద్దురా సెంద్రీ! ఆడ కూసునోళ్ళని సూసినావా?" అనడిగేడు.

సెంద్రి అటు చూసేడు–

ఇద్దరు గుడ్డాళ్ళు... ఓ కుంటి, మొండి చెయ్యి ఉన్న ఆడది, ఎముకలు బయటికి పొడుచుకువచ్చిన ముసిలాడు కన్పించేరు.

"వద్దులే అయ్యా! పోదాం పా" అన్నాడు.

యాదులుకి, కొడుకు తెలివితేటలమీద గొప్ప సంబరం కల్గింది. ఫర్వాలేదు సెంద్రిగాడు బతికేయగలడు అనుకున్నాడు.

ఓసారి యాదులు, సెంద్రిగాడు... బస్సు డిపోలో అడుక్కుందుకు వెళ్తే – 'గుడ్డా? కుంటా? దుక్కలా ఉన్నావు. కూలీ నాలీ చేసి బతక లేవూ? పైగా ఆ వెధవని కూడా శిక్షణిస్తున్నావ్? ఏంరోగం? ప్రతి గాడిద కొడుక్కీ అడుక్కోటం తేలికైపోయింది. ఫో! ఫో!" అని దులపరించేరు. ఎన్ని కూలి పన్లకి ప్రయత్నించేడో – అప్పుడు ఎందరు తమకి పోటీకి వచ్చేవని తిట్టారో– యాదులుకి అనుభవమే! బక్కగవున్నా దుక్కలావున్నా వంటారు! యాదులు ఎప్పుడూ తన అనుభవాలు ఇతరుల ముందు ఏకరవు పెట్టడు! ఎదురుదెబ్బలు తగిలినప్పుడల్లా మలుపు తిరిగి వెళ్తుండటమే – అని సెంద్రిగాడికి చెబుతాడు.

సెంద్రిగాడి చెయ్యి మళ్ళీ గట్టిగ బిగించి – ముందుకు సాగేడు యాదులు. రద్దీ రోడ్లన్నీ దాటేసి సందులోకి తిరిగేరు.

చీకటి పడిపోతోంది. మబ్బులు మరీ దట్టమై పోతున్నాయి. పొద్దుటనగా తిన్న రొట్టె తప్ప – ఆ రోజు ఎక్కువగా దొరకలేదు. గుడిసె చేరేలోగా నాలుగు ఇళ్ళల్లో అడుక్కుంటే ఇంత సద్దికూడు దొరుకుతుందేమో అని రెండు సందులు తిరిగేరు... ఇంతలో టపటప రెండు చినుకులు రాలేయి.

ఠక్కున ఆగి "అరె సెంద్రిగా! వద్దురా! వాన షురు అయింది. ఇగ ఎవ్వరు పెట్టరు నడు నడు" అన్నాడు. ఇద్దరూ వెనక్కి తిరిగి పక్క సందులోనుంచి గుడిసె చేరుకోవాలనుకొన్నారు... గబగబ నడుస్తున్నారు.

** ** **

"వర్షం వచ్చేలా ఉంది నేను వెళతాను జయా! పని మనిషి వచ్చిందో లేదో? అంట్లు

గిన్నెలన్నీ బయట పంపు దగ్గర పడేసి వచ్చాను'' అంది గంట క్రితం షాపింగ్ పూర్తి చేసుకుని వచ్చి జయా వాళ్ళింట్లో కబుర్లాడుతూ కూర్చున్న పద్మ.

''అయ్యో! అదేమిటి పద్మా! అంట్ల గిన్నెలు అలా పెరట్లో పంపు దగ్గర పడేసివస్తే ఎలా? గేటు దూకి ఎవరైనా పట్టుకుపోతే?? అసలు రోజులు బాగు లేవు...'' గాభరా పడింది జయ.

''ఫర్వాలేదులే. మా పక్క రూమ్ స్టూడెంట్ ఉన్నాడు గదా? చదువుకుంటు రూమ్‌లో ఉన్నాడు. చూస్తుంటాడు. పని మనిషి వచ్చి అన్నీ తోమేసి బోర్లించె వెళ్తుంది— అప్పుడప్పుడు అలాగే చేస్తుంటాము'' అని నవ్వింది పద్మ.

''అయితే సరే!''

''ఇంతకీ మనం ఇవాళ డిడెక్షన్‌లో బట్టలు భలేగ తెచ్చుకున్నాం! పేపర్లో అడ్వర్టైజ్‌మెంట్ చూసేం గనుక మనకి తెల్సింది. లేకుంటే ఇంతమంచి ఛాన్స్ మిస్సయేవాళ్లం!'' గర్వంగ అంది.

ఆ మాట గంట నుంచి ఇద్దరూ అరడజను సార్లయినా అనుకున్నారు. మొత్తం బట్టలన్నిటి మీద యాభై రూపాయలైనా లాభం సాధించామని లెక్కలు వేసుకుని తృప్తి పడ్డారు.

''సరే గాలి మరీ చల్లగా వస్తోంది. వర్షం మొదలవుతోంది వెళ్తున్నా!'' అంటూ పాకెట్లు — బాస్కెట్లు రెండు చేతుల్లోకి ఇరికించుకుని నాలుగిళ్ళ అవతలవున్న తమ ఇంటికి చేరింది పద్మ.

గేటు బోల్ట్ తొలగించి లోపలికి వచ్చింది.

'అదేమిటీ? ఈ కుర్రాడు రూమ్‌లోలేడే?' అనుకుంటూ తెల్లగ తోమి బోర్లించిన అంట్లని చూసుకుందామని పెరటివైపు తొంగిచూసింది. గుండె జల్లుమంది. పంపు దగ్గర ఖాళీగా ఉంది. రవ్వంత తడి కూడా లేదు. 'అయ్యో! పనిమనిషి రాలేదు... అంట్ల గిన్నెలు ఎవరో పట్టు

## ధ్వని తరంగాలతో...



మన శరీరం కొన్ని ప్రత్యేకమైన ధ్వని తరంగాల్ని ఉత్పత్తిచేస్తుందని అమెరికాలోని కాలిఫోర్నియా విశ్వవిద్యాలయానికి చెందిన వాలేరీహంట్ అనే శాస్త్రవేత్త ఈమధ్యనే కనుగొన్నాడు. అంతేకాదు ఈ ధ్వని తరంగాలు మన శరీరంలో జరిగే రకరకాల మార్పులకు అద్దం పడ్తాయని కూడా ఆయన అంటున్నాడు. ఏ వయసులో నైనా నొప్పితో బాధపడ్తున్నా బాగా ఆవేశపడినా ఎలాటి అనారోగ్యం పాల్పడినా అందుకు సంబంధించిన ధ్వని తరంగాల్ని శరీరం ఉత్పత్తిచేస్తుంది.

ఈ విషయాన్ని ఆధారంగా చేసుకొని హంట్ ఒక ఎలక్ట్రానిక్ పరికరం ద్వారా ధ్వనితరంగాల్ని పరిశీలించి మనిషి ఎలాటి అనారోగ్యంతో బాధపడ్తున్నాడో గుర్తించడానికి వీలుగా ఒక పద్ధతిని రూపొందించాడు. మామూలు వ్యాధి నిర్ధారక పద్ధతులకంటే ఈ పద్ధతి ఎంతో సున్నితమైనది కూడా! శుభం!

—జూపిటర్

కుపోయారు— కొంప మునిగిపోయింది స్టీలు గిన్నెలు... ఫిల్టర్... పళ్లేలు.. అమ్మో రెండు వందలకి తక్కువ ఉండవు... పద్మ చేతిలో ప్యాకెట్లు — బ్యాస్కెట్ జారి కిందపడ్డాయి. గుండె దడదడ లాడుతోంది.

గేటు చప్పుడుకి వెనక్కి తిరిగి చూసింది.

ఆమె భర్త ఆఫీసు నుంచి వచ్చేడు. సైకిల్ లోపల పెట్టి తాళం వేసి "అదేమిటి అలా నిలబడిపోయావు. ఇప్పుడే వచ్చావా? ఇంకా తాళం తీసినట్టులేదే?" అన్నాడు విశ్వం.

"ఏమండీ?" మాట పెగలక దుఃఖం సుళ్ళు తిరిగి గొంతు బొంగురుపోయింది. భర్త సంగతి తెలుసు. ఇలాంటి నష్టాల్ని సహించలేడు.

"ఏమిటి? ఏమైంది?"

"నేను షాపింగ్ నుంచి వచ్చేసరికి — అంటు... అంటూ..." ఆపైన పదం రావ డం లేదు...

"పని మనిషి తోమలేదా?"

"కాదండీ అసలు అది రాలేదు— అంట్లూ లేవు?"

"అంటే?"

"'పోయాయండి!?' కళ్ళల్లో నీళ్ళు చెంపలమీదికి జారేయి.

ఆడవాళ్ల ముచ్చట్లని... తిరుగుళ్ళని... నిర్లక్ష్యాలని — గ్రైండర్‌లో వేసి రుబ్బినట్టు రెండు నిముషాల్లో తిట్టి"ఇప్పుడు ఎక్కడని వెతుకుతాం!" అన్నాడు.

సరిగ్గా అప్పుడే టపటప రెండు చినుకులు రాలేయి!

"అఘోరించు. వాన కూడా వస్తోంది"

అంటూనే గేటు బయటికి వెళ్లేడు... అటు ఇటు తిరిగి 'మా ఆవిడ ఏంచేసిందో విన్నారా?' అని చిందులు వేసేడు — 'ఎవ రైనా మీకు కనిపించేరా?' అనడిగేడు పక్కిళ్లవాళ్ళని.

"ఇందాక ఓ బిచ్చగాడు, ఓ పిల్లాడు ఈ సందులో నుంచి వెళ్లేరు" అందొక ముసలావిడ.

"వాళ్ళే అయివుంటారండి. ఇలాగే వెళ్లారంటే — ఎవరూ లేరని గిన్నెలన్నీ మూట గట్టుకుపోయుంటారండి. దొంగవెధవలు! అదుక్కుందుకు రావడం — అందితే పట్టుకు పారిపోవడం వెళ్ళండి — అవతల సందులో ఎక్కడైనా దాక్కున్నారేమో? వర్షం బాగా పెద్దదయితే పట్టుకోలేము" వాళ్ళ చేతిలో నుంచి మూట లాక్కు రావాలన్నట్టు తొందర పెట్టింది పద్మ.

విశ్వంతో పాటు ఇద్దరు ముగ్గురు పక్క సందులోకి పరిగెట్టేరు...

** ** **

"అయ్యా! మెల్లగ నడుద్దాం. నాకు కాల్లు నొస్తున్నయి."

"అట్లంటే కాదు కొడకా! గిట్ల సిన్నసిన్నగ సినుకులు ఉండంగనే గుడిసెకి పోవాలె. లేకుంటే ఈ గుడ్డలు పూరాగ తడిసినయ్యంటే ఎండేది గూడా కష్టమే. మనకేమన్నా ఎచ్చగా పండేటందుకు కంబల్లు ఉన్నాయిరా?! లేకుంటే నా ఈపున కూకుంటావురా?"

"సే! ఏందయ్యా! నేనేమన్న

సిన్నపోరగాన్నా? నీ నడుం నొయ్యదా?''
సెంద్రిగాడు తండ్రి మాటలకి పౌరుషం వచ్చి నడక వేగం పెంచేడు.

''అదిగో అదిగో చూసేరా ఎలా పరిగెత్తుతున్నట్టు పోతున్నారో? వాళ్లే వాళ్లే పదండి.''

''ఆగండి! వెధవల్లారా!''

యాదులు — సెంద్రిగాడు ఆగిపోయేరు ఎదురునిల్చున పెద్ద మనుష్యుల్ని చూసి.

''ఏరా! ఏవి గిన్నెలు?''

''ఏం గిన్నెలు దొరా?''

''నువ్వు ఎత్తుకపోయిన అంట్ల గిన్నెలురా? ఏ గిన్నెలో తెలియదా? ఎత్తుకుపోవడం తెలుసా?''

''మాకేం తెలవదు దొరా?''


''తెలవదా? తెలుస్తుంది తెలుస్తుంది పద ముందు ఇంటికి నడవండి వెనక్కి''— యాదులు మెడమీద చెయ్యి వేసి విసురుగా గుంజేడు విశ్వం.

యాదులు, సెంద్రిగాడు వెనక్కి తిరిగి వాళ్లతోబాటు విశ్వం ఇంటికి వచ్చేరు.

''దొరా మీరేమంటున్నారో మాకు సమజైత లేదు. మాకెందుకు గాబాసండ్లు? మేము తియ్యలే దొరా!''

''మరి? కాళ్లు వచ్చి నడిచిపోయాయా? రెక్కలు వచ్చి ఎగిరిపోయేయా? మీరు ఎత్తుకువెళ్ళకపోతే ఇంకెవరు తీసుకు వెళతారురా?'' ఆ హక్కు వాడిదే అన్నట్లు ఖచ్చితంగా ఎత్తుకుపోయి తీరాల్సిందే అని, తీర్మానం చేసినట్లు ఖంగుమంది విశ్వం కంఠం!

''నా ఈ మానంతోనే (మనసాక్షిగ) చెప్తున దొర...గా బాసండ్లు ఎసువంటివో, ఎంకతో, మాకేం తెల్వదు దొర! గింత బువ్వ అడుక్కోని తినేటోళ్ళం —మాకు ఆ బాసండ్లు ఎందుకు దొరా?'' జానెడు పొట్టకు పిడికెడు మెతుకుల ఆరాటం తప్ప — ఈ భూమి మీద తమ కంత కన్నా ఆశ పడే గుండె ధయిర్యం లేదన్న నిస్పృహ



వెళ్ళగక్కేడు.

"నీకు ఈమానం ఒకటా? నిజం చెప్తావా లేదా?" విశ్వం కళ్ళు ఎర్రబడ్డాయి. పళ్ళు బిగుసుకున్నాయి. తన కష్టార్జితమైన వస్తువులు,... అప్పన్నంగా తన్నుకుపోతాడా? అసలే ఆఫీసు నుంచి అలసిపోయి వచ్చాడు. పైగా ఈ వాన తుంపర ఒకటి!... అసహనానికి అన్నీ తోడయి విశ్వాన్ని ఊపేస్తున్నాయి.

ఇంతలో వార్త తెలిసి జయకూడా ఆదరా బాదరా పరిగెత్తుకొచ్చింది.

"ఏమిటి పద్మా? అంట్లగిన్నెలు ఎత్తుకుపోయాడా? వీళ్ళేనా? వెధవ ప్రపంచం ఎలాతయారైందో? బయటికి వెళ్ళాలంటేభయంగా వుంది. ఇంకా ఎలా మాస్తున్నాడో చూడు"

"లేదు తల్లీ మాకెరకలే! మేము దీయలే! దల్మంగ చెప్తున్న తల్లి" యాదులు కుడి చెయ్యి నెత్తిన పెట్టుకున్నాడు.

"ఓయబ్బ! సత్యహరిశ్చంద్రుడి తన్ని పుట్టేడండి. ధర్మాన్ని తప్పని సత్యమూర్తి! చూస్తారేమండి.పోలీసు కంప్లెంటు ఇస్తేసరి. రోగం కుదిరిపోతుంది" అన్నారెవరో.

"ఆ! పోలీసులెందుకండి. నాల్గు అంటిస్తే వాడబ్బకూడా దిగిరావాలి" అంటూ పట్టలేని ఆవేశంతో ప్యాంటుకున్న బెల్ట్ ఊడలాగి సర్రున గాలిలోకి విసిరేడు.

యాదులు వీపుమీద పాతచొక్కా పిగిలి వీపుని చూపెట్టింది.

"అబ్బా!" యాదులు గొంతు మూల్గింది.

'ఫటా ఫటా' పోట్ల గిత్త పోట్లలా,విశ్వం చేతిలో బెల్ట్ యాదులు వంటిమీద కుమ్ముతోంది.

"వద్దు దొరా! నేను తియ్యలే దొరా!" యాదులు రెండు చేతులు దెబ్బలకి అడ్డుపెట్టుకుంటున్నాడు.

"అయ్యో! అయ్యో! మా నాయనని కొట్టకుండి, కొట్టకుండి" సెంద్రిగాడు యాదుల్ని చుట్టుకున్నాడు.

ఎండినట్టున్నవాడి కళ్ళలో... వరద పొంగులా దుఃఖం పెల్లుబికింది.

అయ్య ఒంటిమీద పడ్తున్న ప్రతిదెబ్బకి వాడి గుండె గుడిలోని ప్రేమ సాగరం — గట్లుతెంచుకుని — కళ్ళనుంచి జలపాతంలా దూకుతోంది.

వాడు అమ్మని ఎరగడు! అయ్యే అమ్మ! అమ్మంటే అయ్యే! ఆకలేస్తే అన్నం తినిపించేది అయ్య! ఆ అయ్యలేకుండా అన్నం కూడా తినడు — ఇంత పెద్దలోకం వున్నా, వాడికి అయ్యతోడితే లోకం! ఆ అనుబంధం — ఆత్మీయత ... డబ్బెట్టి కొనలేదు!! రక్తంలోనుంచి పేగుల్లోనుంచి ఉండలుచుట్టుకుని వస్తుంది.

అయ్య మీదపడే బెల్ట్ సెంద్రిగాడిమీద కూడా పడింది.

"అయ్యా!" అని అరిచాడు.

"కొడగా! దూరం జరుగు" అన్నాడు.

"వెధవ నిజం చెప్తున్నాడు చూడండి" విశ్వం మళ్ళీ రెచ్చిపోయాడు.

"అబ్బా! వద్దు దొరా! నాకేం తెల్వదు దొరా!" యాదులు మెలికలు తిరిగేడు — కాళ్ళమీద పడిన దెబ్బలకి—

"వద్దయ్యా! మా నాయనని

కొట్టకయ్యా!'' రెండు చేతులు జోడించి పైకెత్తి దండం పెట్టేడు సెంద్రిగాడు.

తడి గుడ్డలతో దేవుడి ఎదుట మొక్కుకుంటున్న భక్తుళ్ళావున్నాడు. వానజల్లులో తడుస్తూన్న సెంద్రిగాడు—

సరిగ్గా అప్పుడే వచ్చాడు, పక్కరూమ్‌లో వుండే స్టూడెంట్! చేతిలో కీచైన్ విలాసంగా తిప్పుతూ— తలమీదపడిన నీళ్ళు విదిలించుకుంటూ — గేటు లోపలికి వచ్చిన ఆ కుర్రాడు అక్కడ జరుగుతున్న గందరగోళాన్ని చూసి — ''ఏమైందీ? ఏమిటీ?'' అనడిగేడు, విభ్రాంతిగ!

''అంట్ల గిన్నెలు ఎత్తుకుపోయాడట్ట!''

''దొంగవెధవ కొట్టినా చెప్పటంలేదు!''

''అందుకే పోలీసు కంప్లెంటు ఇవ్వాల్సిందే!''—

''ఆగండాగండి! ఎవరి అంట్లగిన్నెలు!'' ఆ కుర్రాడు ముఖం కొశ్చన్ మార్కు అయింది.

పద్మ ముందుకువచ్చి ...''అదేనండి నేను మధ్యాహ్నం పంపుదగ్గర అంట్ల గిన్నెలన్నీ పడేసి షాపింగ్‌కి వెళ్ళానా? నేను వచ్చేసరికి —తోమి బోర్లించి వుండాల్సిన గిన్నెలు — అసలు లేనేలేవు! మీరూమ్‌కి తాళం వుంది! దొంగిలించిన వస్తువులు ఎక్కడో దాచి వీళ్ళిద్దరూ గబగబా పారిపోతున్నారు. పట్టుకుని తీసుకువచ్చాం!'' అంది.

ఆ కుర్రాడు వెంటనే తన రూమ్ తాళం తీస్తుంటే—

''లేదు దొరా! సత్తెంగ నేను తియ్యలే దొరా!'' కంగారుగా, ఏడుస్తూ చెప్పేడు యాదులు ఆ అబ్బాయికూడా ఏ కర్రో తెచ్చి కొట్టాడన్న భయంతో.

స్టూడెంట్ కుర్రాడు తలుపులు తెరిచి— ''ఇదిగో ఇలా చూడండి'' అని పిల్చేడు పద్మని.

ఆ రూమ్‌లో తూముదగ్గర పద్మవాళ్ళ అంట్లగిన్నెలన్నీ దొంతర్లుగా అమర్చిపెట్టి వున్నాయి!!

''అవునండి. నేను అర్జెంట్‌గా బయటికి వెళ్ళాల్సివచ్చింది. మీరు లేరు. మీ పనిమ్మనిషి రాలేదు. అందుకని — పంపుదగ్గర గిన్నెలన్నీ జాగ్రత్తగా నారూమ్‌లోకి చేర్చి — నేను వెళ్ళిపోయాను. — అవెక్కడికి పోలేదు''—

అన్నాడు — ఒక్కొక్కళ్ళే గదిలోకి వెళ్ళి చూసి బయటికి వచ్చారు..

అప్పటివరకు — నిలువెత్తు నీతి శూలాలతో — పేదరికపు శత్రువుని చీల్చి

## దుఃఖం



''ఏవే లక్ష్మీ పక్కవాళ్ళింటికెళ్ళినప్పుడల్లా అమ్మ అలాకళ్ళు వత్తుకుంటూ వస్తుంది. పాపం వాళ్ళు అంత కష్టాల్లో వున్నారా?'' అడిగాడు పరంధామయ్య కూతురు లక్ష్మిని.

''అదేం కాదు నాన్నా. వాళ్ళు ఏదయినా కొత్తవస్తువు కొంటే చూడ్డానికి అమ్మని రమ్మంటారు. అది చూడగానే అమ్మకి దుఃఖం పొంగుకొస్తుంది'' చెప్పింది లక్ష్మి.

—యమ్మే. మసూద్ (హైదరాబాద్)

చెండాడుతున్న 'పెద్దరికాలన్నీ' — తలలు పొంచుకునే ఆత్మసాక్ష్యం లేక — మౌనంగా మిగిలిపోయాయి!

మనసులో గొణుక్కుంటు — ఎవరిదారిన వాళ్లు తప్పుకు పోతుంటే — "దొరికినాయా దొరా!? అన్ని బాసండ్లు సరిగావున్నాయా? నేను చెప్పలేదా. తియలేదు దొరా?" అంటూ చౌక్కా అంచుతో కళ్ళు తుడుచుకున్నాడు యాదులు — అయ్య కాళ్లు ఆప్యాయంగా తడుముతున్న సెంద్రిగాడికి ఆకాళ్లు ఈనెపుల్లిల్లా కనబడలేదు. నల్లగా అనిపించలేదు.

పచ్చటి మేలిమి బంగారు కడ్డీలమీద — ఏ ద్రవమో ఒలికి మచ్చలు పడ్డట్టు — ఆ దెబ్బల తాటూకు వాతల్ని జాగ్రత్తగా నిమిరేడు.

అప్పటివరకు తాళమేనా తీయని పద్మ — గబ గబా తాళంతీసి లైటువేసింది. ప్యాకెట్లు — బాస్కెట్లు మూరుకిందనుంచి ఇంట్లోకి చేర్చింది.

"ఇదీ! ఏదో పొరపాటుపడ్డాం! ఈ రెండు రూపాయలు తీసుకునిపొండి!" జేబులోనుంచి నోటుతీసి యాదులుకి అందించి — గబగబా ఇంట్లోకి వెళ్లిపోయేడు విశ్వం!


తన రూమ్ గుమ్మంలో నిల్చున్న స్టూడెంట్ కుర్రాడికి ఓ చిత్రమైన ఊహకల్గింది.

'నేను చెయ్యని తప్పుకి నన్ను చావగొట్టేవు కదా? — ఇప్పుడు నేను, నిన్ను — తిరగబడి బాదితే ఏం చేస్తావ్—'

ఈ మాటలు యాదులు అంటేనో?... అనాలి... అనాలి... అనుకుంటున్నాడు.

యాదులు — సెంద్రిగాడి చెయ్యిపట్టుకుని — వానజల్లుకి తడిసి — చిరుచీకట్లోకి — గేటువైపుకి వెళుతూ — అన్నాడు...

"కాల్మొక్త దొరా! నీ బాంచన్! పోతున్నం."!!!



డిజైన్: బి.ఎస్. మూర్తి (సికిందరాబాద్)